

తుంగభద్రకు నిలకడగా ఇన్‌ఫ్లో
తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం 11,987 క్యూసెక్కులు నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో 89.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కిలో టమాట @ రూ.60
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.30, సరాసరిన రూ.45 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/22.4°
జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొంచెం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్


నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'స్పందన' సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించింది.

ఖాద్రీ ఆలయంలో 17న బహిరంగ వేలం



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానానికి భక్తులు సమర్పించిన లావు బియ్యం, ఇనుప సామగ్రిని ఈ నెల 17న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. లావు బియ్యానికి రూ.50,000, ఇనుప సామగ్రికి రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని సూచించారు. అనంతరం మొత్తం నగదు కట్టాల్సి ఉంటుందన్నారు.

లక్ష్మీనృసింహున్ని దర్శించుకున్న జిల్లా జడ్జి



జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా జడ్జి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి, ఈఓ విజయ్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జిని ఈఓ సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.
• గుంతకల్లు మండలం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామిని కూడా జిల్లా జడ్జి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం జడ్జికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా సెపక్‌తక్రా పోటీలు



ఉరవకొండ, బ్రహ్మసముద్రం మధ్య మ్యాచ్

ఉరవకొండ: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సెపక్‌తక్రా జిల్లా స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దావూద్‌తో పాటు సెపక్‌తక్రా సంఘం జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, ఎంపీ షాహిన్ క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండురోజులపాటు సాగే ఈ పోటీల్లో 30 బాల, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం తొలిరోజు పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఉరవకొండ మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం హైస్కూలు జట్టు విజేతగా, ఉరవకొండ ప్రభుత్వ పాఠశాల జట్టు రన్నరప్‌గా నిలిచాయి. తృతీయ స్థానంలో బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ స్కూల్ నిలిచింది. బాలికల విభాగంలో తట్రకల్లు కేజీబీవీ జట్టు విజేతగా నిలవగా, ఆమిద్యాల జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచింది. తృతీయ స్థానంలో ఉరవకొండ మహేశ్వరీ స్కూల్ జట్టు నిలిచింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ఎస్జీటీ మధుబాబు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

గ్యాస్.. బుస్!



☛ జూలై 29న కొత్తచెరువు మండలం వంగంపల్లిలోని ఓ ఇంట్లో సిలిండర్ పేలింది. అంతకుముందు రోజు రాత్రి సిలిండర్ పైప్ నుంచి గ్యాస్ లీకైనట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలియని ఆ ఇంటి ఇల్లాలు రాజేశ్వరి (37) తెల్లవారుజామున కట్టెల పొయ్యి వెలిగించే ప్రయత్నం చేయగా... మంటలు వ్యాపించాయి. తీవ్రంగా గాయపడిన ఆమె వారం రోజుల తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

- తరచూ సిలిండర్ పేలుళ్లు
- వంగంపల్లిలో ఓ మహిళ మృతి
- గోరంట్లపల్లిలో తప్పిన ప్రమాదం
- అవగాహన లేకపోవడమే కారణం!

సాక్షి, పుట్టపర్తి: గ్యాస్ సిలిండర్‌తో మహిళలకు వంటింట్లో పొగ బాధలు తప్పాయి. ఇలా వెలిగించగానే అలా వంట చేయడం సాధ్యమవుతోంది. అందువల్లే దాదాపు అందరూ ఇప్పుడు గ్యాస్ వినియోగానికే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా అర్హులైన వారికి వివిధ పథకాల కింద గ్యాస్ సిలిండర్లు అందజేస్తోంది. ఫలితంగా ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ గ్యాస్ సిలిండర్ కనిపిస్తోంది. జాగ్రత్తగా వాడుకుంటే ఎంతో మేలు చేసే ఈ వంట గ్యాస్ సిలిండర్... ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రాణాలే తీసేస్తోంది.

అవగాహన లేకే ప్రమాదాలు..
గ్యాస్ సిలిండర్ వాడకంపై అవగాహన లేక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. సీలు వేసిన సిలిండర్లు కాకుండా... రెండు, మూడు కిలోల లెక్కన చిన్న సిలిండర్లు నింపించుకుని వాడటం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సిలిండర్ నుంచి స్టవ్‌కు అమర్చే పైప్‌ను నిత్యం పరిశీలిస్తూ ఉండాలి. పైప్ దెబ్బతిన్నట్లు అనిపిస్తే వెంటనే మార్చుకోవాల్సి ఉంది. కానీ చాలా మంది ఈ విషయం మరచిపోతున్నారు. దీంతో పైప్ నుంచి గ్యాస్ లీకై ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్యాస్ సిలిండర్లపై మహిళలతో పాటు ఇంట్లో సభ్యులందరూ నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

జిల్లాలో 30 ఏజెన్సీలు..
జిల్లా వ్యాప్తంగా 30 గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఇండేన్, భారత్, హెచ్‌పీ అన్నీ కలిపి 8 లక్షలుపైగా కనెక్షన్లు ఉన్నాయి. డెలివరీ బాయ్స్ గ్యాస్ సిలిండర్ ఇచ్చి వెళ్లిన వెంటనే ఇంట్లో ప్రమాదం జరిగితే ఏజెన్సీ నుంచి లీకవుతున్నట్లు భావిస్తారు. సిలిండర్ డెలివరీ అనంతరం రెండు, మూడు రోజులకు ప్రమాదం సంభవిస్తే వినియోగదారుడి అవగాహన లోపమే కారణంగా భావిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే సిలిండర్ అమర్చిన రోజునే ప్రమాదాలు జరిగిన దాఖలాలు జిల్లాలో ఇప్పటి వరకు నమోదు కాకపోవడం గమనార్హం.

పక్కదారి పడుతుండటంతో..
గృహోపయోగ వంట గ్యాస్ పక్కదారి పడుతోంది. బహిరంగంగానే వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. అడిగిందే తడువుగా టీ దుకాణాల నుంచి రెస్టారెంట్ల వరకూ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గృహోపయోగ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. వారు గృహోపయోగ గ్యాస్ సిలిండర్ నుంచి చిన్న సిలిండర్లకు గ్యాస్ నింపడం, వాహనాల్లో సైతం అక్రమ రీఫిల్లింగ్ చేయడం తదితర చర్యలతో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో అక్రమ రీఫిల్లింగ్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కొత్తచెరువు మండలం గోరంట్లపల్లిలో ఈ నెల 9వ తేదీ రాత్రి సావిత్రమ్మ ఇంట్లో సిలిండర్ వద్ద మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ఆమె.. కేకలు వేసుకుంటూ ఇంటి నుంచి బయటికి పరుగులు తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు కాలిపోయాయి. సిలిండర్‌కు ఉన్న రబ్బరు దెబ్బతినడంతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు.



పేలని సిలిండర్లు వచ్చాయి



గ్యాస్ ప్రమాదాలు జరుగుతుండటం బాధాకరం. అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ వినియోగించే ప్రతి వినియోగదారుడికీ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ వారు డిస్ట్రిబ్యూటర్ల నుంచి వసూలు చేసిన డబ్బుతో బీమా చేస్తారు. కరోనా, భారీ వర్షాలు, వరదల సమయంలో కూడా ప్రజలకు సిలిండర్లు అందజేశాం. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు నిర్వాహకులను బాధ్యులను చేయాలనుకోవడం సరికాదు. ఇటీవల ఇండేన్ గ్యాస్‌లో పేలని ప్లాస్టిక్ సిలిండర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. వాటిని వినియోగిస్తే ప్రమాదాలను అరికట్టడం సులువవుతుంది.

– రాజీవ్‌దేవ్,
ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ, పుట్టపర్తి

అవగాహన తప్పనిసరి



గ్యాస్ సిలిండర్ వాడకంపై కుటుంబ సభ్యులందరూ అవగాహనతో ఉండాలి. ప్రమాదాల నివారణ కోసం అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి. ప్రమాదం జరిగిన తర్వాత నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు పాటిస్తే మంచిది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ వారి సూచనల ప్రకారం నిబంధనలు పాటిస్తే బీమా రూపంలో ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంటుంది. వినియోగదారుడు చిరునామా మార్చుకున్నా ఏజెన్సీకి తెలియజేయాల్సి ఉంటుంది.

– వంశీకృష్ణారెడ్డి,
పౌర సరఫరాల అధికారి

అక్రమాలకు అడ్డుకట్ట

- పంచాయతీల్లో ఇక డిజిటల్ లావాదేవీలు
- రేపటి నుంచే ప్రారంభం



అనంతపురం రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న సంకల్పంతో ఏర్పడిన పంచాయతీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు తీసుకొచ్చాయి. పంచాయతీల్లో ఇది వరకు మ్యానువల్ విధానంలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేసేవారు. అయితే పన్నుల చెల్లింపు విషయంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటుండటంతో మ్యానువల్ విధానానికి చెక్ పెట్టి ఇక నుంచి నగదు రహిత (డిజిటల్) లావాదేవీలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నుంచి అన్ని రాష్ట్రాల్లోనూ నగదు రహిత లావాదేవీల ప్రక్రియను ప్రారంభించనున్నారు. దీంతో పంచాయతీల్లో ఇక నుంచి ఇంటి, కొళాయి పన్నులు, భవనాల అద్దెలు, లేఅవుట్, భవన నిర్మాణ అనుమతి, లైసెన్సు ఫీజులు తదితర చెల్లింపులన్నీ డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.

లావాదేవీలు ఇలా...
ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,044 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏడాదికి అన్ని రకాల పన్నులు కలిపి రూ.వంద కోట్ల వరకు వసూలు చేస్తున్నారు. ఇక నుంచి గ్రామపంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే పంచాయతీలకు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిచారు. కేంద్రం అందించే ఆర్థిక సంఘం నిధులు నేరుగా ఆయా బ్యాంక్ ఖాతాలోకి జమ కానున్నాయి. పంచాయతీ బ్యాంక్ ఖాతాలకు గూగుల్‌పే, ఫోన్‌పేలను అనుసంధానం చేస్తారు. క్యూఆర్ కోడ్, యూపీఐ స్కానర్ల ద్వారా పన్నులు వసూలు చేయనున్నారు. దీంతో పన్నులు ఎంత శాతం వసూలు చేశారు, ఎవరి నుంచి వసూలు చేశారు వంటి విషయాలు వెంటనే అధికారులకు తెలిసిపోతాయి. స్మార్ట్ ఫోన్ లేని వారు పంచాయతీ ఖాతాకు బ్యాంక్ ద్వారా లేదా ఇతరుల ఫోన్‌పే నుంచి పన్నులు చెల్లించవచ్చు. ప్రసుత్తం పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలంటే నగదు లేదా చెక్కుల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. అయితే ఇకనుంచి ఎలాంటి చెల్లింపులైనా డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. నగదు రహిత లావాదేవీల వల్ల క్యాష్ రిజిస్టర్, లెడ్జర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటుంది.

డిజిటల్ విధానంలోనే చెల్లింపులు
ఈ నెల 15 నుంచి చెల్లింపులన్నీ నగదురహిత లావాదేవీల విధానంలోనే ఉంటాయి. ప్రజలు ఇక నుంచి డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.
– ప్రభాకర్‌రావు, డీపీఓ, అనంతపురం

అరుదైన వ్యాధిగ్రస్తులకు ఆపన్నహస్తం



బాలురతో డాక్టర్ శ్రీకాంతి

హిందూపురం టౌన్: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఖర్చు ఎంతైనా వెనక్కు తగ్గకుండా పేదల ఆరోగ్యాలకు భరోసా ఇస్తోంది. అందులో భాగంగానే ఓ అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు బాలలకు రూ. 50 వేల విలువ చేసే మందులను అందించి ఆపన్నహస్తం అందించింది. వివరాలు.. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన ఇద్దరు బాలలు ముక్కులో రక్తం కారుతున్న స్థితిలో వచ్చారు. వారిని పరీక్షించిన డాక్టర్ శ్రీకాంతి.. జన్యుపరంగా వచ్చే ఫ్యాక్టర్ 8 (రక్తం గడ్డకట్టడం) వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి వారికి ప్రత్యేకమైన ఇంజెక్షన్ వేయాల్సి ఉంది. ఫ్యాక్టర్ 8 ఇంజెక్షన్ 250 ఐయూ (ఇంటర్నేషనల్ యూనిట్) ధర రూ.10 వేల వరకూ ఉంటుంది. ఇద్దరికీ కలిపి మొత్తం రూ. 50 వేల విలువ జేసే ఇంజెక్షన్లు ఇవ్వాలని తెలిసింది. ఈ విషయాన్ని ఆస్పత్రి అధికారులు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అనంతపురం జిల్లా డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి.. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి ఆ ఇంజెక్షన్లను హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. దీంతో ఆ బాలురలో ఒకరికి 750 ఐయూ, మరొకరికి 500 ఐయూ ఇంజెక్షన్లను డాక్టర్ శ్రీకాంతి అందజేశారు. వారి ఆరోగ్యం కుదుటపడడంతో ఆదివారం డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ తెలిపారు.

నీటి తొట్టెలో పడి విద్యార్థి మృతి



మృతుడు నాని

గార్లదిన్నె: ఈత సరదా ఓ విద్యార్థిని బలిగొంది. 108 సిబ్బంది తెలిపిన మేరకు.. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన నాని (13) అదే గ్రామంలో ఏడో తరగతి చదువుతున్నాడు. గార్లదిన్నె మండలంలోని శిరివరంలో నివాసముంటున్న అవ్వ ఇంటికి తల్లిదండ్రులతో కలసి పీర్ల పండుగకు వచ్చాడు. ఆదివారం గ్రామ శివారులోని దోబీఘాట్ వద్ద ఉన్న నీటి తొట్టెలో ఈత కొట్టేందుకు వెళ్లిన నాని.. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. ఎంత సేపటికీ కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో గాలింపు చేపట్టారు. చివరకు నీటి తొట్టెలో విగతజీవిగా తేలియాడుతున్న నానిని గుర్తించి, 108 అంబులెన్స్‌లో గార్లదిన్నె పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

రైస్ పుల్లింగ్ వస్తువుల తయారీ ముఠా అరెస్ట్

హిందూపురం అర్బన్: రైస్ పుల్లింగ్ వస్తువులు తయారు చేసి ఇతరులకు అమ్మకం చేసే ముఠా సభ్యులను ఆదివారం హిందూపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సీఐ ఈరన్న వెల్లడించారు. ఆదివారం శిర–కొడికొండ రోడ్డులో కొల్లకుంట వద్ద కంపచెట్లలో అనుమానాస్పదంగా కనిపించిన పలువురిని అదుపులోకి విచారణ చేయడంతో రైస్ పుల్లింగ్ వస్తువుల తయారీ అంశం వెలుగు చూసింది. పట్టుబడిన వారిలో కొట్నూరుకు చెందిన వెంకటకిషోర్, సోమందేపల్లికి చెందిన క్రిష్టప్ప, చిలమత్తూరు మండలం నేసేవాండ్లపల్లికి చెందిన రవీంద్రారెడి, కర్నూలు జిల్లా చిన్నకంబదూరుకు చెందిన వెంకటేశ్వర్లు, అదే జిల్లా కల్లూరుకు చెందిన మల్లికార్జునరెడ్డి, గుంటూరు జిల్లా పెనుమాకలకు చెందిన రవీంద్రారావు, నిజాంపట్నానికి చెందిన ప్రసాద్, కృష్ణా జిల్లా యనమల కోడూరుకు చెందిన శ్రీనివాసరావు ముఠాగా ఏర్పడి శనివారం హిందూపురం చేరుకుని అజంత లాడ్జిలో బస చేశారు. అనంతరం సోమందేపల్లి మండలం కదిరేపల్లికి చెందిన నరసింహారెడ్డిని కలసి రైస్ పుల్లింగ్ వస్తువుల తయారీతో పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించవచ్చునని బెంగళూరుకు చెందిన ప్రవీణ్‌ను నమ్మించారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం శిర–కొడికొండ రోడ్డులో కొల్లకుంట వద్ద కంపచెట్లలో రాగి, ఇత్తడి చెంబుల్లో ద్రావణం పోసి వేడి చేసి విక్రయించేందుకు సిద్ధం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన నరసింహారెడ్డి పరారీలో ఉన్నాడు.



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

మస్తానయ్య గంధోత్సవం.. తరించిన భక్తజనం

స్థానిక పాత గుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం మధ్య రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ దర్గా ధర్మకర్తలు, వక్ఫ్‌బోర్డు అధికారులు, దర్గా ముజావర్ల నేతృత్వంలో ఈ ఉత్సవం కొనసాగింది. అందంగా అలంకరించిన గంధం పల్లెంను గుర్రంపై ఉంచి మేళతాళాలతో దర్గా నుంచి గణాచారి రెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. సాజెదినాసేన్ (పూజారులు) ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. మస్తానయ్య ప్రార్థనా మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేలాది భక్తులతో దర్గా పరిసరాలు కిక్కిరిసాయి. –గుంతకల్లు:

సత్యసాయి బాటలో నడుద్దాం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఒడిశా రాష్ట్ర చిన్నారులు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: భగవాన్ శ్రీసత్యసాయి చూపిన బాటలో నడుస్తూ ప్రతి భక్తుడు సమాజ సేవకు పునరంకితమవ్వాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పిలుపునిచ్చారు. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయం చేరుకున్న ఒడిశా రాష్ట్ర సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సాగిన కచేరితో భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడుతూ సేవా మార్గంలో పయనిస్తూ భక్తులకు సత్యసాయి దిశానిర్దేశం చేశారన్నారు. ఒడిశా రాష్ట్రంలో వరదలు సంభవించిన సమయంలో సత్యసాయి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఆదుకుందని ఆయన గుర్తు చేశారు. అభాగ్యులకు పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. సత్యసాయి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి ఒక్క భక్తుడూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. మహామంగళ హారతితో ముగిశాయి.

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం


మృతుడు చాంద్‌బాషా

ధర్మవరం అర్బన్: స్థానిక కొత్తపేటకు చెందిన బేల్దారి చాంద్‌బాషా (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మద్యానికి బానిసగా మారిన చాంద్‌బాషా జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య షకీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


మృతుడు సత్యనారాయణ

బత్తలపల్లి: నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం సంగాల గ్రామానికి చెందిన సత్యనారాయణ (34)కు భార్య సరోజమ్మతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం కుటుంబసభ్యులందరూ అప్పరాచెరువులోని బంధువల ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సత్యనారాయణ బహిర్భూమికని సమీపంలోని చిత్రావతి నదికి వెళ్లాడు. అక్కడ నీటి గుంత వద్దకెళ్లిన సమయంలో ఫిట్స్ రావడంతో అదుపు తప్పి గుంతలో పడి మృతి చెందాడు. విషయాన్ని అటుగా వెళుతున్న గ్రామ సర్పంచ్ కంచనగారి రాజశేఖర్‌రెడ్డి గుర్తించి సమాచారం అందించడంతో స్థానికులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని వెలికి తీసి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

తలుపుల: మండలంలోని పెద్దపల్లి సమీపంలోని వనమోళ్ల బావిలో శనివారం సాయంత్రం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీని పసిగట్టినట్లు పోలీసులు తెలిపారు. వివిధ మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆదివారం మృతదేహాన్ని పరిశీలించి బలిజపేటకు చెందిన కె.శ్రీనివాసులు (44)గా గుర్తించారు. మృతుడికి భార్య లత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకు తెరువులో భాగంగా ఇటీవల భార్య కువైట్‌కు వెళ్లింది. అప్పటి నుంచి ఒంటరితనంతో బాధపడుతున్న శ్రీనివాసులు మతిస్థిమితం కోల్పోయి సంచరించేవాడు. ఈ క్రమంలో శనివారం వనమోళ్ల బావి వద్ద సంచరిస్తూ అదుపు తప్పి అందులో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

యంత్ర'సాయం'లో మేటి

గార్లదిన్నె ట్రాక్టర్ నగర్ గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఇదేదో కాలనీ అనుకుని పొరబడే వారూ ఉన్నారు. వాస్తవానికి ఇది ప్రసిద్ధ సంస్థ. వ్యవసాయ యంత్ర పరికరాల పరీక్షణ, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో అత్యంత కీలకమైనది. ఇక్కడ ధ్రువీకరణ పొందిన వ్యవసాయ యంత్ర పరికరాలకు మాత్రమే ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ సంస్థ నాలుగు దశాబ్దాలుగా ఏడు రాష్ట్రాలకు సేవలందిస్తోంది.

- ఏడు రాష్ట్రాలకు సేవలందిస్తున్న గార్లదిన్నె ట్రాక్టర్ నగర్
- వ్యవసాయ యంత్ర పరికరాల పరీక్ష, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో కీలక సంస్థ
- రైతులు, యువత, విద్యార్థుల శిక్షణలోనూ కీలకపాత్ర


ట్రాక్టర్ నగర్‌లో ప్రదర్శనకు ఉంచిన వివిధ రకాల యంత్ర పరికరాలు


వేరుశనగ కాయల నూర్పిడిపై శిక్షణ పొందుతున్న మహిళా రైతులు

సాక్షి, అనంతపురం డెస్క్: ఆధునిక పద్ధతులను అవలంబించినప్పుడే ఏ రంగంలోనైనా ప్రగతి సాధ్యమవుతుంది. ఇందుకు వ్యవసాయ రంగమూ మినహాయింపు కాదు. పెరిగిన పెట్టుబడులు, కూలి ఖర్చుల కారణంగా సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం రైతులకు భారంగా మారింది. ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్న రైతులు మాత్రమే ఎంతోకొంత లాభపడుతున్నారు. ఇందులో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం ఒకటి. ప్రస్తుతం వివిధ రకాల యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ట్రాక్టర్ మొదలు పంట కోత యంత్రాలు, స్ప్రేయర్లు, భూమిని దున్నే, చదును చేసే యంత్రాలను రైతులు వినియోగిస్తున్నారు. ఇవి అందుబాటులోకి రావడం వెనుక వివిధ సంస్థల దశాబ్దాల కృషి ఉంది. అలాంటి సంస్థల్లో దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ట్రాక్టర్ నగర్ (గార్లదిన్నె) అత్యంత కీలకమైనది.

శిక్షణ.. ఉపాధి కల్పన

వ్యవసాయ యంత్ర పరికరాల మరమ్మతులు, వినియోగం, సాంకేతిక అంశాలపై శిక్షణ పొందేందుకు వివిధ రాష్ట్రాల రైతులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. వ్యవసాయ పరికరాల ఉత్పత్తిదారులు, విక్రయదారులు, మహిళా రైతులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. వారం మొదలు ఆరు వారాల వరకూ యూజర్ లెవల్ కోర్సులు, రెండు నుంచి ఆరు వారాల టెక్నికల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. కనీస విద్యార్హత ఎనిమిదో తరగతి కాగా, శిక్షణ సమయంలో ఉపకార వేతనంతో పాటు ఉచిత వసతి కల్పిస్తున్నారు.

50 వేల మందికి పైగా శిక్షణ..

ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ 50 వేల మందికిపైగా శిక్షణ పొందారు. వివిధ కంపెనీలు తయారు చేసిన 50 యంత్ర పరికరాలను ధ్రువీకరించారు. ఇటీవల కొత్తగా నిమాటిక్ సీడ్ డ్రిల్, విద్యుత్ వరికోత యంత్రాలు, 6, 8 వరసల్లో వరి నాటే యంత్రాలను పరీక్షించారు. వివిధ రాష్ట్రాల్లోని రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏడు రాష్ట్రాలకు ఏకైక సంస్థ..

ట్రాక్టర్ నగర్ ప్రధాన ముఖద్వారం



వ్యవసాయ యంత్రాలను పరీక్షించడంతో పాటు వినియోగం, మెరుగుదలపై యువత, విద్యార్థులు, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 1983 సంవత్సరంలో గార్లదిన్నె మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసింది. భారతదేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు శిక్షణ కేంద్రాల్లో ట్రాక్టర్‌నగర్ ఒకటి. దేశంలో బుదిని (మధ్యప్రదేశ్), హిస్సార్ (హర్యానా), విశ్వనాథచారియాలి (అస్సాం), ట్రాక్టర్ నగర్ గార్లదిన్నె వ్యవసాయ యంత్రాలపై శిక్షణ–పరీక్షణ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాలకు సేవలందించేందుకు ట్రాక్టర్ నగర్‌లో సంస్థను నెలకొల్పారు. కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా నడుస్తూ, ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు/సంస్థలు తయారు చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను పరీక్షించడంతో పాటు నాణ్యతను ధ్రువీకరిస్తోంది. ఇక్కడ ధ్రువీకరించిన వాటికి మాత్రమే ప్రభుత్వ సబ్సిడీలు వర్తిస్తుండటంతో దక్షిణ భారతదేశంలో తయారయ్యే ఆధునిక యంత్ర పరికరాలను టెస్టింగ్ నిమిత్తం ఇక్కడికి తెస్తున్నారు. వాటి పనితీరు పరిశీలించి, అవసరమైన మార్పులు కూడా సూచిస్తున్నారు.

శిక్షణ చాలా బాగుంది.



జోధ్‌పూర్‌లోని కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ అగ్రికల్చర్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నా. ఏ–1 సిరీస్ కోర్సులో భాగంగా శిక్షణకు వచ్చా. ఇక్కడి వసతులు బాగున్నాయి. వ్యవసాయ విజ్ఞానం పెంపొందించుకున్నా. ఇక్కడి అధికారులు ఎంతో ఓపిగ్గా అన్ని అంశాలను వివరిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ చాలా బాగుంది.

– అభిషేక్ మోదన్‌వాల్, జోధ్‌పూర్

ఉపకార వేతనం అందుకున్నా



జోధ్‌పూర్‌లో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ చదువుతున్నా. వ్యవసాయ యంత్ర పరికరాలపై శిక్షణ కోసం దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాలు శిక్షణ, పరీక్షణ సంస్థకు వచ్చా. వ్యవసాయ యంత్రాల మరమ్మతులు, ఉపయోగించే విధానంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. శిక్షణ సమయంలో ఉపకార వేతనం కూడా పొందుతున్నా. ఆధునిక పద్ధతులను పాటిస్తే ఏ రంగంలోనైనా ప్రగతి సాధ్యమవుతుంది.

– రాహుల్ దూద్‌వాల్, జోధ్‌పూర్

మరింత అభివృద్ధి చేస్తాం



అన్ని పంటలకు సంబంధించిన ఆధునిక పరికరాలను ట్రాక్టర్ నగర్‌లో ప్రదర్శనకు ఉంచుతాం. నేను గతంలో భోపాల్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించే వాడిని ప్రభుత్వం డైరెక్టర్ హోదా కల్పించి ట్రాక్టర్ నగర్‌కు బదిలీ చేసింది. సిబ్బంది సహకారంతో దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను మరింత అభివృద్ధి చేస్తా. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పెట్టుబడులు తగ్గించవచ్చు.

– డాక్టర్ బాలాజీ మురారి, డైరెక్టర్, ట్రాక్టర్ నగర్

గడ్డం రాజగోపాల్‌పై అట్రాసిటీ కేసు నమోదు

ముదిగుబ్బ: ధర్మవరం నియోజకవర్గంలో సామాజికవేత్తగా గుర్తింపు పొందిన గడ్డం రాజగోపాల్‌పై ఆదివారం పట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. మలకవేమల క్రాస్ నుంచి ముదిగుబ్బ వైపు కారులో వెళుతున్న తనను గడ్డం రాజగోపాల్, ఆయన అనుచరులు అటకాయించి కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లుగా పోలీసులకు కదిరి మండలం బీరేపల్లిపేటకు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం గడ్డం రాజగోపాల్‌తో పాటు అతని అనుచరులు గంగాధర్, టిప్పుసుల్తాన్, కిషోర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య


మృతురాలు అర్చన

కూడేరు: మండలంలోని మరుట్ల–1 కాలనీకి చెందిన పుష్పావతమ్మ కుమార్తె బంగారు అర్చన (23) ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం తన ఇంట్లోనే ఆమె క్రిమి సంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, కొంత కాలంగా అర్చన తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేదని, నొప్పిని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

కంబదూరు: భూ వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణలో తమ్ముడు దాడి చేయడంతో అన్న మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ముత్యాలప్ప, నరసింహులు, కిష్టప్పకు 1.50 ఎకరాల భూమి ఉంది. ఇటీవల వీరు భాగ పరిష్కారాలు చేసుకున్నారు. పొలంలో ఉన్న వ్యవసాయ బోరు కిష్టప్ప భాగానికి వచ్చింది. దీంతో ఆదివారం ముత్యాలప్ప కుటుంబసభ్యులు నరసింహప్పతో గొడవకు దిగారు. మాటమాటా పెరిగి ఆవేశంలో అన్న ముత్యాలప్ప (50) ఎదపై నరసింహప్ప కాలుతో తన్నాడు. ఘటనతో ముత్యాలప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావిలో విగ్రహం లభ్యం


లభ్యమైన విగ్రహం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కోట వీధిలోని పట్టాభి రామస్వామి ఆలయ సమీపంలో ఉన్న పురాతన బావిని శుభ్రం చేస్తుండగా రాతి విగ్రహం బయటపడింది. పూర్వం ఈ బావిలో నీటిని నిత్యపూజ కోసం బ్రాహ్మణులు సేకరించుకునేవారు. దీంతో ఈ బావిని మడుగు బావి అని పిలిచేవారు. కాల క్రమేణా పాడుపడిన ఈ బావిని స్థానికులు వారం రోజులుగా శుభ్రం చేస్తున్నారు. ఆదివారం బావిలో నుంచి పూడిక తీస్తుండగా నాగుల విగ్రహం బయటపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని విగ్రహానికి పూజలు చేశారు.

అర్చక సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని జానకీరామయ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఏపీ అర్చక సమాఖ్య జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నరసింహయ్య ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులుగా నరసింహాచార్యులు, పార్థసారథి ఆచార్యులు, నరసింహ బట్టర్, అధ్యక్షుడిగా కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కుమార్‌రాజా చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజునాథ, కార్యదర్శిగా శ్రీనిధి, విజయగోపాల్, సభ్యులుగా రవీంద్రనాథ్, జయరామప్ప, సుబ్రహ్మణ్యం, అనందకుమార్, వానవోలు సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

అప్పట్లో ఎలుకలతో దాడి చేయించాం

- స్వాతంత్య్ర సమరయోధుడు వీఎస్ రెడ్డి
- తాలూకా కార్యాలయంలో రికార్డుల దహనం
- బ్రిటీష్ ఖజానా లూటీకి పథకం

సందర్భం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్


స్వాతంత్య్ర సమరయోధుడు వీఎస్ రెడ్డి

పావగడ: 'ఆ రోజులే వేరు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలకు తెగించి బ్రిటీష్ పాలకులను ఎదిరించాం. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాం. జైలు పాలయ్యాం. కష్టాలెన్ని ఎదురైనా సంతోషంగా ఎదుర్కొన్నాం' అంటూ స్వాతంత్య్ర ఉద్యమంలో తాను అనుసరించిన పోరుబాటును సమరయోధుడు వీఎస్ రెడ్డి (వి.నరసింహారెడ్డి) వివరించారు. ఆజాదీ కా అమృత్ దినోత్సవ్ సందర్భాన్ని పురస్కరించుకుని తన అనుభవాలను ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు వీఎస్ రెడ్డి 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే..

ఎస్ఎస్ఎల్‌సీ వరకూ చదువుకుని..

ప్రస్తుతం నాకు 101 ఏళ్లు. 1923, మార్చి 4న పావగడ తాలూకా వెంకటాపురం గ్రామంలో జన్మించాను. నాన్న ఎర్రపరెడ్డి, అమ్మ లక్ష్మమ్మ వ్యవసాయం చేసేవారు. నాలుగేళ్ల క్రితం నా భార్య వెంకటలక్ష్మమ్మ మృతి చెందింది. ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అప్పట్లో నేను ఎస్ఎస్ఎల్‌సీ వరకూ చదువుకున్నా... వ్యవసాయం, ఉద్యాన పంటల సాగులో పలు పరిశోధనలు చేశా. శాస్త్రవేత్తల సెమినార్లలోనూ పాల్గొన్నాను. జెడ్పీ సభ్యుడిగా ఉన్నప్పుడు తాలూకా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో రోడ్లకిరువైపులా చింత మొక్కలు నాటించాను. అవి పెరిగి ఆయా పంచాయతీలకు ఆదాయ వనరులుగా మారాయి.

తొలినాళ్లలో దొరలకు అనుకూలంగా పాలన

1947లో దేశానికి స్వాతంత్య్రం వచ్చినా.. ఎవరికీ దాని అనుభూతి తెలిసేది కాదు. ఎందుకంటే ఆ రోజుల్లో బ్రిటిష్ దొరలు నియమించిన మహారాజులు తెల్లదొరలకు అనుకూలంగానే భారతీయులపై పెత్తనం సాగిస్తూ వచ్చారు. అప్పట్లో పాఠశాలల ప్రార్థన సమయంలో 'అవర్ నోబల్ కింగ్ ఎడ్వర్డ్ లాంగ్ లివ్' అనే నినాదాలు చేయించేవారు. గండభేరుండ పక్షి గుర్తు ఉన్న జెండాను ఎగుర వేసేవారు. వీటన్నింటినీ మేము ధిక్కరించేవాళ్లం.

కార్యాలయంలో రికార్డులు దగ్ధం చేశా

నా చిరు ప్రాయంలోనే స్వాతంత్య్ర ఉద్యమాల్లో పాల్గొన్నా. ఎక్కడ చూసినా నిరసనలు పెద్ద ఎత్తున జరిగేవి. మేము కూడా పావగడ తాలూకా కార్యాలయంలోని రికార్డులు తగులబెట్టి బ్రిటీష్ పాలకుల చేతిలో ఉన్న ఆధారాలను నాశనం చేయాలనుకున్నాం. అయితే పోలీసుల పహారా ఎక్కువగా ఉండడంతో సాధ్యమయ్యేది కాదు. ఒకట్రెండు రోజులు ఆలోచించి ఎలుకలు పట్టుకుని వాటి తోకలకు బట్ట చుట్టి కిరోసిన్‌తో తడిపి నిప్పు పెట్టి కార్యాలయంలో వదిలాం. కాసేపటికే మంటలు ఎగిసి పడి రికార్డులు దగ్ధమయ్యాయి. ఆ తర్వాత బ్రిటీష్ ఖజానా లూటీకి తాలూకాకు చెందిన దేశ భక్తులు పి.రామారావు, నాగరత్నంశెట్టి శివలింగయ్యతో కలసి పథకం రచించా. ఈ విషయం పసిగట్టిన పోలీసులు ముసాఫర్ ఖానాలో రాత్రి నిద్రిస్తున్న మా ఏడుగురిని అరెస్ట్ చేసి తుమకూరు జైలుకు తరలించారు. అక్కడ కూడా మేము బ్రిటీష్ దొరల అరాచకాలను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టే వాళ్లం. అనంతరం మమ్మల్ని బెంగుళూరులోని సెంట్రల్ జైలులో బంధించారు. మొత్తం 32 రోజులు జైలులోనే గడిపాం. అక్కడే నీలగిరి చెట్లకు రాట్నం గుర్తు గల భారతీయ జెండాను ఆవిష్కరించాం. జైలు నుంచి విడుదలైన అనంతరం ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఎద్దుల బండ్లపై ఊరూరా తిరిగి స్వాతంత్య్రం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాం. నీలం సంజీవరెడ్డి, ఏఎం లింగణ్ణ, కల్లూరు సుబ్బారావు, పెడపల్లి చిదంబరరెడ్డితో పరిచయాలు ఉన్నాయి. ఏది ఏమైనా ఆ రోజులు ఇలా 'సాక్షి' ద్వారా గుర్తు చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది.


గాండ్లపెంటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


చెన్నేకొత్తపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

గాండ్లపెంట/చెన్నేకొత్తపల్లి: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము..చదువులమ్మ చెట్టు నీడలో..అన్నట్టు ఒకచోట చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక చోట కలుసుకున్నారు. తమ చిన్న నాటి మధుర జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. జిల్లాలోని గాండ్లపెంట, చెన్నేకొత్తపల్లిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. గాండ్లపెంటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, చెన్నేకొత్తపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలల్లోనే కలుసుకున్నారు. తాము తరగతి గదిలో చేసిన అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గాండ్లపెంటలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు జీకే ఫకృద్దీన్, బాబూ ప్రకాష్, రెడ్డప్పను ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు పామిడి ముంతాజ్‌అలీతో పాటు పూర్వ విద్యార్థులు కిషోర్‌కుమార్‌రెడ్డి, పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నాగేష్‌రెడ్డి, ఎల్.నరసింహారెడ్డి, సికిందర్, పామిడి ఇక్బాల్, పామిడి రఫీ, జక్కల రాజేశ్వరీ, ప్రసన్న, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే చెన్నేకొత్తపల్లిలో నాటి గురువులు నారాయణరెడ్డి, సుబ్బన్న, కేశవరెడ్డి, కేశన్నను ఘనంగా సత్కరించారు.